# సరికొత్త కవితా ప్రక్రియ నానీలు

## కొట్టి రామారావు



జలయజ్ఞం / ఫలితానిచ్చింది
ఇప్పుడు పడవల్లోనే / ప్రయాణం!

మన రాష్ట్రప్రభుత్వం కొన్ని వేలకోట్ల పెట్టుబడితో 'జలయజ్ఞం' చేస్తున్నటు పదేపదే ప్రకటిస్తున్నది. దాదాపు నూరు సంవత్సరాలలో ఏఒక్కసారి కురవనంత భారీవర్షం ఈ మధ్య కురిసింది - కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో. ఈ రెండు ప్రధాన సంఘటనల కవితా స్వరూపం ఈ చిన్న నానీ రూపంలో ఎంత చక్కగా కుదిరిందో చూడండి.

కాలేజీ దగ్గరని / బార్ లైసెన్సివ్వరా!
అయితే షిఫ్టు చేసేద్దాం / కాలేజీనే!

విషయం సుబోధకం. ఈ రెండు నానీలు నేను ఈ మధ్యనే వ్రాసిన పొత్తిళ్ళలో బిడ్డలు.

నానీల సృష్టి 1997లో వార్త దినపత్రికలో ధారావాహికంగా ప్రారంభమైంది. కర్త డా. ఎన్. గోపి. వీటిని ఆయనే 1998లో పుస్తకరూపంలో తీసుకుని వచ్చారు. తరువాత సంవత్సరమే ఎస్.ఆర్. భళ్ళం 'గూడువదలని గువ్వలు', 2001లో సోమేపల్లి వెంకటసుబ్బయ్య 'తొలకరి చినుకులు' నానీలు పుస్తకాలుగా వచ్చేయి. తర్వాత చాలామంది కవులు నానీలు వ్రాయడం ప్రారంభించారు. 2005నాటికి నాతో కలిపి 35 మంది వీరితో కలిస్తే నేడా సంఖ్య 70కి దాటింది. వారిలో రసరాజు, ద్వా.నా.శాస్త్రి, ఎస్.రఘు, పృధ్వీరాజ్, ఎ.జనార్ధన్, కోట్ల, శారదా అశోకవర్ధన్, భవానీదేవి, సుజాత, రజిత, కొట్టి రామారావు, జిసనారా మొదలైన వారు ఉన్నారు.

ఇంతకీ నానీల స్వరూపం ఏమిటి?

'నావీ నీవీ వెరసి మనవి' అని డాక్టర్ గోపీయే చెప్పారు. దీనికి నాలుగు పాదాలు ఉంటాయి. మొదటి రెండు పాదాలు ఒక భావాంశాన్నీ, తక్కిన రెండు పాదాలు మరో భావాంశం లేక మొదటి దానికి సమర్థకంగానూ ఉంటుంది. నాలుగు పాదాల్లోని అక్షరాలు 20 నుండి 25 వరకు మాత్రమే ఉండాలి. ఈ పాదాలు, అక్షర నియమం తప్పక పాటించాలి.

అకులు లేకుండా / చెట్టునెలా గుర్తిస్తావ్?
పచ్చదనమే / చెట్టు చిరునామా! - డా. ఎన్. గోపి.
కన్నీళ్ళు రానివ్వకు / ఒక పాలే ఉన్న నేల
మరింత / కుంచించుకుపోతుంది. - కొట్టి రామారావు.
సునామీ నానీ ఇటువంటిదే మరోటి.
మూడొంతులు / భూమి నీదే కదా!
అయినా / కబ్జాదారువయ్యావా? - టి. సంపత్ కుమార్

నానీలలో హాస్యాన్నీ పండించవచ్చు:

గడియారం / ఆగిపోయింది
ఆస్తికోసం / అంతర్యుద్ధం మొదలు - జిసనారా.
ఆసుపత్రిలో / జీవన్ మృతుడు
బయటపడి / బ్రతికిపోయాడు - కొట్టి రామారావు.
పచ్చగడ్డెలా మండుద్దనా / సిద్ధాంతాలు
రాజకీయుల / మధ్య వేస్తే సరి - ఎన్. ప్రతాప్‌కుమార్.
జాతకం తెల్పకే / చిలుక చిక్కింది!
ఇప్పుడేమో / ఇతరులకు జోస్యమట! - ఎన్. సుజాత

**ఎన్నో ఆధ్యాత్మిక విషయాలను అతి సూక్ష్మంగా చెప్పవచ్చు:**

రోజూ / ఎందరినో కలుస్తూంటాను
నన్ను కలవటమే / కుదరటం లేదు - డా. ఎం. విజయశ్రీ
కోరికల నదిలో / బ్రతుకో బుడగ
ఎంతకీ / దరిచేరని పడవ - డా. సి. భవానీదేవి.
జననం / దిగంబరం
మరి మరణం? / చిదంబర రహస్యం - కారం శంకర్.
విశ్వదర్శనం / చేశావు నిజమే
నీ గురించి కాస్త చెప్పు / చూద్దాం - కొట్టి రామారావు.

**ప్రకృతి అందాల్ని నానీలలో చక్కగా కవిత్వీకరించవచ్చు:**

గడ్డి పూవు పై / వాలిందో సీతాకోక
ఊయలూపుతూ / గాలి లాలిపాట - డా. పృథ్వీరాజ్.
ప్రకృతి బడిలో / ఏడాదికో వసంతం
పిల్లలబడిలో / రోజూ వసంతమే - ఎన్. రవీంద్ర.
సముద్రవీణను / కొనవేళ్ళతో మీటుతూ
తియ్యగా పాడుతోంది / నింగి కన్నె - చిమ్మపూడి శ్రీరామమూర్తి.
రంగులన్నీ కలిస్తే / ఇంద్రచాపం
చినుకులన్నీ గొంతెత్తితే / వర్ష రాగం - కొట్టి రామారావు.
కెరటం / వచ్చింది
భూదేవి పాదపూజకు / నురుగుపూలతో - రసరాజు.
పచ్చని ఆకులపై / రంగురంగుల పూలు
అవి / ఆకుల స్వప్నాలే కదా - డా. శిరీష.
వేరును కాదని / వేరుపడితే
చెట్టుకొమ్మకు / పట్టెక్కడ? - దుగ్గిరాల సోమేశ్వరరావు.
కొబ్బరాకులమీద / చినుకులు

దోసిలి జారిన / ముత్యాలు - జిసనారా

**దుఃఖాతిశయాన్ని నానీలలో చెప్పినప్పుడు హృదయం ద్రవిస్తుంది:**

జరీ అంచుల్లో / ఆకలి మంటలు

మగ్గం గోతులు / సిద్ధంగా ఉన్న సమాధులు - ఎస్సార్. పృథ్వి.

చెట్టు / తలదించుకుంది

అన్నదాత ఉరికి / ఆధారమైనందుకు - నాగిశెట్టి.

ఏ చేపకు ఏ వలో / తెలుసు జాలరికి

నీటి వలగురించే / తెలియదు - టి. సంతత్ కుమార్.

మానేరు డ్యాం / పల్లెల్ని తరిమేసింది.

పల్లెలు పట్నంలో / తలదాచుకున్నాయి - డా. ఎం. హరిదాసు.

నీరు, ధాన్యం / పుష్కలమే అయినా

అన్నింటికీ కరువే / ఒక్క కన్నీటికి తప్ప - కొట్టి రామారావు.

**ప్రేమానురాగాలను నానీలలో ఎంత బాగా చెప్పవచ్చో చూడండి:**

ఎప్పటికీ తీరనిది / తల్లి ఋణం

తిప్పి రాయాల్సిందే నోటు / జన్మజన్మకీ - నాగిశెట్టి.

అమ్మ సేవలు / వెలకట్టలేనివి

వెల లేదుగనుకే / విలువలేదు - రాణీ ప్రసాద్.

మా నాన్న / చెరుకు పండించేవాడు

అందుకే / అనుబంధాల్లో అంత తీపి - ఎన్. అరుణ

తొలిచూపు / ప్రేమ

తొలకరి జల్లులో / మొలిచిన మొలక - సోమేపల్లి వెంకటసుబ్బయ్య

అమ్మను వర్ణించే / పద్యం ఉందా?

అమ్మే ఒక మహా / పద్యం కదా! - శారదా అశోకవర్ధన్.

**పచ్చి నిజాలను కవిత్వీకరించటం నానీలలో అద్భుతంగా చూపించవచ్చు:**

భూకంపం / నిలువెత్తు భవనాలు కూల్చింది.

కులం మాత్రం / అలాగే నిల్చుంది - తుమ్మిడి నాగభూషణం.

తప్పులకు / ధైర్యమొచ్చింది

చాలామంది / తమ వెనుక ఉన్నారని - కోవ్వూరి పుష్పాదేవి.

దీపంతో / పోల్చక్కర్లేదు

కిరోసిన్‌కి / అర్పించుకుంటే చాలు - ఎస్సార్. భళ్ళం.

నేను చెప్పేది / ఒకటే నిజం

బ్రతుకంతా/అబద్ధాలపుట్ట

కొద్దిపాటి నియమాలను ఛందస్సు అంటారా?:

అంటే అనండి. కానీ ఈ ఛందస్సు ఎంతో సులభతరమైనది. నాలుగు పాదాల నియమం మనకు ఎప్పటినుండో ఉన్నదే. వేమన పద్యాలు, సుమతీ శతకం, గురజాడ ముత్యాల సరాలు, సినారె గజళ్ళు, ఆరుద్ర కూనలమ్మ పాదాలు - నానీలకు ముందున్న నాలుగు పాదాల కవితలే రెండేసి పాదాల నియమం అనుకూలమే కానీ ప్రతికూలం కాదు. వేమన పద్యాలు, సుమతీ శతకం పద్యాలు - రెండేసి భావాంశాలను తీసుకుని వాటికి మూడు, నాలుగు పాదాలలో సమన్వయం చేశారు. వాటికున్న యతి ప్రాస నియమాలు నానీలకు లేవు కదా!

ఉప్పుకప్పురంబు / నొక్కపోలికనుండు
చూడచూడ రుచులు జాడవేరు / విశ్వదాభిరామ వినుర వేమ.

ఇకపోతే అక్షర నియమం. ఈ సందర్భంలో ఎప్పటినుండో ప్రాచుర్యంలో ఉన్న (ఇండియాలో కాకపోవచ్చు) హైకూలకున్న సంక్లిష్టత నానీలకు ఏమాత్రము లేదు. హైకూలకు - మొదటి పాదం 5 అక్షరాలు, రెండవపాదం 7 అక్షరాలు, మూడవపాదం 5 అక్షరాలు ఉండాలి. నియమాలను తప్పక అనుసరించాలనుకునే రచయితలు హైకూలు మూడూ పాదాల్లోనే పై అక్షర నియమాన్ని అనుసరించి తీరాలి. అందుకోసమే కాబోలు హైకూ కవుల్లో హెచ్చు మంది అక్షర నియమాన్ని పాటించటం లేదు. పైపెచ్చు అది అనవసరం అనే స్థితికీ వచ్చారు. (అక్షర నియమాన్ని పాటిస్తూ మంచి హైకూలు వ్రాసిన కవులూ ఉన్నారు. పృథ్వీరాజ్, బి.వి.వి.ప్రసాద్, కొట్టి రామారావు, పెన్నా మొదలైనవారు).

ఈ పై కారణాల వలన నానీలలోని అక్షర నియమం ఏమాత్రం ఇబ్బంది లేనిదే కాకుండా సంపూర్ణ భావ వ్యక్తీకరణకు దోహదకారి అనడంలో సందేహం లేదు. నానీలలో నాలుగు పాదాలలో ఒక పాదానికిన్ని అక్షరాలని కానీ, రెండు పాదాలకూ కలిపి ఇన్ని అక్షరాలని కానీ నియమం లేదు. మొత్తం అక్షరాలు 20-25 నియమం వెనుక వెసులుబాటు ఉంది. మొత్తం అక్షరాలు రూప సంక్లిష్టత అనే ఆశయం ఉంది. కట్టుబాటులో స్వేచ్ఛ, స్వేచ్ఛలో కట్టుబాటూ ఉంది. దేశీయ ఛందస్సులు ఇలాంటివే. అటు అక్షర సమత, ఇటు మాత్రా సమతకు దేశీ చందస్సుకు మధ్యే మార్గం. యతి, ప్రాసల విషయంలో స్వేచ్ఛ ప్రాస, యతిరూపం (ప్రాసయతి)లో ఉంది. వీటి విషయంగా ఐచ్ఛికత ఉంది. అదే భావన గోపి నానీల సృష్టికి కారణమైందని ఆయన పీఠికలు, ఇంటర్వ్యూలు, 8వ వార్షికోత్సవ కీలక ఉపన్యాసంలోనూ చెప్పాయి. ఇది దేశీయమైనదన్నారు గోపి. గణబంధాలు దేశఛందోగణ నియమాలు లేక ఇది వచన కవిత్వమే. వచన కవిత్వంలోని విస్తృత రూపానికి సంక్షిప్త స్వరూపం. చిన్న భావం అనతికాలిక గానం, అత్యల్ప సంవిధానం, ముక్త కంఠస్తయోగ్యం నానీలకు మరికొన్ని లక్షణాలు". - డా. సంగంభట్ల నరసయ్య. ("నానీలు - సంవీక్షణం"లో)

నానీ నియమాల సౌలభ్యం కారణంగానే నానీ కవులు అతి తక్కువ కాలంలోనే పెరిగారు. అంతకు ముందు ఛందోబద్ధమైన కవిత్వము వ్రాసే సీనియర్ కవులు - రసరాజు, దుగ్గిరాల లాంటి వారు నానీల వైపుకు మళ్ళారు. ఇంకొక ముఖ్యమైన విషయం - నానీలు వ్రాసే 70, 80 మందిలో 99% కవులు పై నానీల ఛందస్సును అతి తేలిగ్గా అనుసరిస్తూ గొప్ప కవిత్వాన్ని వ్రాయగల్గుతున్నారు. వేమన పద్యాల్లాగా నానీలను సభల్లో, ఉపన్యాసాల్లో సులభంగా కోట్ చేస్తున్నారు. మచ్చుకు కొన్ని:

రెక్కలొచ్చిన పక్షి / గింజలకోసం
ఖండాంతరాల / వలస - పెరుగు రామకృష్ణ.

చూపులు చూసేది / వెలుగునే
మరి మనసు / చీకటినీ చూస్తుంది. - శారదా అశోకవర్ధన్.

ఈ కన్నీటి చుక్క / బరువెంత?
ఏ కొండ కూడా / మొయ్యలేనంత - ఎన్. అరుణ.

చెప్పులని / ఛీ కొట్టకు మిత్రమా!

తిరిగి అవే కొడితే / తలెత్తుకోలేవు - ఎస్. సుజాత

నేల మీద / వాన దేవుడు సంతకమైతే గాని

పంటల జీ.వో.లు / రావు - చిమ్మపూడి శ్రీరామమూర్తి.

ప్రతాపమంటే / ఆకలిదే

ఎండలో బండల్ని కూడా / పిండి చేయిస్తుంది - కారం శంకర్.

ప్రాజెక్టులో / నీళ్ళు వదిలారు

కాల్వలన్నీ / పక్క జేబుల్లోకే - జిసనారా.

అమ్మకు / స్వార్థం ఎక్కువ

ఎంతసేపూ / బిడ్డలు బాగుండాలనే - కోవూరి పుష్పాదేవి.

**నానీలలో కొంతమంది మహనీయుల్ని వారి పేర్లు చెప్పకుండా - వారి ఘనకార్యాలతో, వారి రచనలతో స్ఫురింపచేయడం ఒక ప్రత్యేకత.:**

నీలి కలువ రేకల్లో / పూచింది 'కత్తి'

దళిత మహాసభ / ఓ మహా శక్తి - నేతల ప్రతాప్ కుమార్.

ఏడు పదులలోనూ / యజ్ఞం చేశాడు

కథా నిలయం / తెలుగోడి డాక్యుమెంట్ - ద్వా.నా. శాస్త్రి

గబ్బిలానికి / ఆకాశాన్నిచ్చిన గుండె

దాని పేరు / వినుకొండ - కె.జె. రమేష్.

రసగంగాధరం / కవితామృతం కురిపించిన రాత్రి

మళ్ళీ / ఎప్పుడొస్తుందో - కొట్టి రామారావు.

'కాల్తున్న' గుడిసెల్నుం'డి' / పైకెగసిన

కవిరాజు / బాధల పల్లకీ 'బోయి' - కొట్టి రామారావు

**కవితా సౌలభ్యం - వస్తువైవిధ్యం:**

నానీలు వ్రాయటంలో కవితా సౌలభ్యం ఉండటమే కాకుండా వస్తువైవిధ్యాన్ని ప్రదర్శించవచ్చు.

ఇంతకు ముందే నానీల్లో హాస్యం, ఆధ్యాత్మికం, ప్రకృతి అందాలు, దుఃఖాతిశయం, ప్రేమానురాగాలు, పచ్చి నిజాలు - ఎంత బాగా చెప్పవచ్చో సోదాహరణంగా వివరించడం జరిగింది. ఇప్పుడు మరికొన్ని - ఆ కోవలోనే ...

**సౌందర్యాధన:**

ఆ అమ్మాయి / వెన్నెల్లో పుచ్చపువ్వు

కన్నుల్లో వెలుగు / గుండెలో దిగిన మొవ్వు - కొట్టి రామారావు.

కన్న కళ్ళను / చె రోటి పంచుకున్నారు

అప్పుడు చూసుకున్నె / ఒదాన్నొకటి - ఎస్. సుజాత.

నేల ప్రమిదలో / వాన దీపాలు

అంతటా / హరిత కాంతులు - చిమ్మపూడి శ్రీరామమూర్తి.

సంగీతం / ఒక్కొక్క పొరనే తొలగిస్తుంది
ఆత్మలోకంలో / అమృత స్నానం! - డా. ఎన్. గోపి.
చూపును / నాటాను
మానస మాగాణిపై / మొలిచింది ప్రేమ మొలక - ఎస్సార్ భళ్ళం.

**అభివ్యక్తి - శక్తివంతంగా:**

దహనంలో / కుడి చెయ్యి కాలలేదు
కారణం / కలం పట్టిన చెయ్యి - డా.ఎన్. గోపి.
మనసొక ప్రిజం / కిరణం
పరావర్తనం / అదే పరివర్తనం - జిసనారా
ముసలితనం / ఎంత త్వరగా వచ్చేస్తుందో
మనిషితనమే / కష్టం - అంబళ్ళ జనార్ధన్.
మనసొక రేడియో / మనక్కావలసిన స్టేషన్లు
మనమే / ట్యూన్ చేసుకోవాలి - ఎస్. రేవత్.
కడుపులో ఉన్నప్పుడు తంతే / బాధలేదు
బయట ఉండి తంతేనే / నరకం - డా. కె. రామకృష్ణ.
ఎన్నేళ్ళయినా / ఇంకిపోనిది సముద్రం
కన్నీటికి / సరిజోడు - పి. లక్షణరావు.

**గ్లోబలైజేషన్:**

విసిరాడు / విష సంస్కృతి వల
పాశ్చాత్య జాలరి / ఇంటర్నెట్ - డా. పృధ్విరాజ్.
క్రెడిట్ కార్డుల్లో / పళ్ళు తోముకుంటున్నారు
కొన్నాళ్ళకు / బోసినోరే - ఎస్సార్. పృధ్వి.
హైటెక్ యుగం / అంతటా కంప్యూటర్లు
మనోవ్యధ తుడిచే / సాఫ్ట్ వేర్ లేదు - పత్తిపాక మోహన్.
గ్లోబల్ విలేజీలో / లోకమంతా ఒకటే
మనుషులే / దూరదూరంగా - డా. సి. హెచ్. భవానీదేవి.
పొరుగు వాడి /ఊరూ పేరూ తెలియదు
ప్రపంచమంతా / చాటింగ్ చేస్తారా - కొట్టి రామారావు.

**సామాజిక చైతన్య స్ఫూర్తి:**

చమురు తాగింది / కృతజ్ఞత వెలిగింది
మనిషీ / నీమాటేమిటి - రసరాజు.
నదుల్ని కలపాలని / ఒకటే గోల
ముందు / మనసుల్ని కలిపి చూడు - జిసనారా.

సందేహం లేదు / భారీ ప్రాజెక్టులే

వాటి క్రింద / అవినీతి పునాదులు - ఎస్సార్. పృధ్వి.

**మార్మికత:**

మార్మికత అంటే మౌళిక సత్యాల అన్వేషణ, అనుభవం. దీనిని నానీలలోనూ విపులంగా ప్రదర్శించవచ్చు.

ధనవంతునికీ / దరిద్రుడికీ

తృప్తిలో భేదమే / సరిహద్దు రేఖ - కొట్టి రామారావు.

మట్టే మనుషుల్లో / ఇన్ని రంగులెందుకో

మట్టి గర్భం / నానావర్ణరంజితం - కోసూరి గాంధీ.

రోడ్డు మీద బొమ్మ / గీచిన బాలుని కడుపులో

ఆకలి బొమ్మపై / చిల్లర - నల్లా నరశింహమూర్తి.

భూగోళం / సదా పచ్చి బాలింతరాలు

క్షణక్షణానికో / కానుపు - ఎస్. రఘు.

మహాత్ముడే / మళ్ళీ ఎందుకు పుట్టాలి?

మరో వారసుడికి / ఏంపుట్టింది - ఎ. రజిత

పిచ్చాసుపత్రి / వెయ్యి రెట్లు మెరుగు

యుద్ధోన్మాదులు / మతోన్మాదులకంటే - వై. కృష్ణకుమారి.

పక్షికి / ధరలే కాదు

మనిషి ఆశకు / కూడా రెక్కలే - గాదిరాజు రంగరాజు

పండుకి గురిపెట్టి / పక్షిని నేలకూల్చాడు

అహో / అమెరికా తెలివి - త్సవటపల్లి.

పచ్చని పల్లె జీవితం / పారిపోతుంది

చేలన్నీ / చేపలచెఱువైనందుకు - సాయివెంకన్న బాబు.

నవమాసాలు మోసేది / కన్నీటి రుచి చెప్పేది

సృష్టి బొంగరం తిప్పేది / స్త్రీ - యశస్వీ రంగనాయకి

నగరం చుట్టూ / ప్లాట్ల సమాధులు

బతికుండంగానే / బక్కరైతు శవాలు - కోట్ల వెంకటేశ్వరరెడ్డి.

నానీల ఆవిర్భావం జరిగి 8 సంవత్సరములు దాటింది. డా. గోపితో ప్రారంభించబడిన నానీల కవిత్వం అనతి కాలంలోనే ఆంధ్ర దేశంలోని అనేక మంది కవులకు స్ఫూర్తినిచ్చి తామూ నానీలు వ్రాసేలా చేసింది. ఇదంతా కేవలం ఐచ్ఛికంగానే. ఏరకమైన ప్రచారార్భాటం లేకుండానే సహజంగా జరిగిన పరిణామం. ఏ కవిత్వానికైనా ముఖ్యంగా నేటి కవిత్వానికి కావలసింది సామాజిక, సాంస్కృతిక చైతన్యం. అది నానీల కవిత్వంలో ఉన్నదనీ, అందువలననే అనతి కాలంలోనే వంద సంఖ్యకు చేరుకున్న నానీ కవులు - కొన్ని వేల నానీలను జనరంజకంగా వ్రాసి సామాన్య ప్రజల్లోకి పంపుతున్నారు. ఈనాడు ఏ సాహిత్యసభలో చూసినా నానీల ప్రస్తావన - అనేక విషయాలను ప్రస్తావిస్తూ కవులు నానీలను కోట్ చేయటం - నానీల సృష్టికర్తకు తన లక్ష్యం నెరవేరినట్లుగా భావించవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే డా. గోపి సృష్టించిన నానీలు - వేమన పద్యాల్లా, గురజాడ ముత్యాల సరాల్లా ఎంతో ప్రాచుర్యాన్ని పొందాయి, పొందుతున్నాయి. ఒక కవి

అన్నట్లు నానీలు కేవలం నాలుగు పంక్తులు కలిగి ఉన్న ప్రక్రియ కాదు. అనేకమైన కవితా మార్గాలను సంలీనం చేసుకున్న అద్భుత సాహిత్య ప్రక్రియ.

**నానీలు వ్రాయటం సులభం కాదు:**

మంచి నానీలు వ్రాయడానికి, 'నానీల నాన్న 'ట్రెండ్ సెట్టర్' గోపి గారి సలహాలను తప్పక పాటించండి.

1. నానీలు రాసే లక్షణాలు పాటించండి. అవి కాలపరీక్షకు నిలబడ్డాయి.

2. ఏది పడితే అది నానీయం చేయకండి. ఉత్కంఠమైన భావావేశం ఉంటే తప్ప నానీ సాంద్రీకరణ చెందదు. కవికి నిజాయితీ ముఖ్యం.

3. మన పిల్లలు క్రమంగా తెలుగుకు దూరమవుతున్న సన్నివేశంలో ఉన్నాం. అలా దూరం కాకుండా నానీలు ఒక తెలుగు వాతావరణాన్ని కాపాడుతాయి. కాబట్టి పిల్లల్ని నానీల రచనకు ప్రోత్సహించండి. కవుల సంఖ్య పెరిగితే దుర్మార్గుల సంఖ్య తగ్గుతుంది.

4. నానీల కవితారూపం, సౌలభ్యం, వైవిధ్యం గురించి ప్రముఖ కవులు, సాహిత్య విమర్శకులు - డా. సి.నా.రె., ఎ.బి.కె.ప్రసాద్, ఐ.వెంకట్రావు, సతీష్ చందర్, రాచపాళెం, ఎన్. వేణుగోపాల్, సుదర్శన్, నాగ భైరవ, డా. అద్దేపల్లి, ఆచార్య బేతవోలు, ఆచార్య తంగిరాల, ఆచార్య సిమ్మన్న, మునిపల్లి రాజు - ఇంకా ఎంతో మంది - అభినందిస్తూ - నానీ కవులను నానీలను ఆహ్వానిస్తున్నారు. మనమూ ఆహ్వానిద్దాం.....

